సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



బయోమైనింగ్ పూర్తిచేయాలి
బయోమైనింగ్‌ను వచ్చే నెల 15 నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. - 8లో



'బలగం'తో ప్రకృతి వ్యవసాయం
వాసాలమర్రి శివారులో ఓ ఉమ్మడి కుటుంబం ప్రకృతి వ్యవసాయంతో స్వచ్ఛమైన గానుగ నూనె తయారు చేసి విక్రయిస్తోంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
41°/25°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



వైటీడీఏ విస్తరణ

- ప్రస్తుతం 7 గ్రామాల పరిధిలో యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ ఏరియా
- దీని పరిధిలోకి చేరనున్న భువనగిరి, కొలనుపాక
- ఆదాయ మార్గాల పెంపునకు ప్రయత్నాలు
- హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎస్ శాంతికుమారి


యాదాద్రి ఆలయం

సాక్షి, యాదాద్రి: ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రంగా యాదాద్రి మాస్టర్‌ప్లాన్ మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం వైటీడీఏ పరిధిలో కేవలం 7 గ్రామాలైన యాదగిరిగుట్ట చుట్టూ ఉన్న యాదగిరిపల్లి, దాతరుపల్లి, సైదాపురం, మల్లాపురం, గుండ్లపల్లి, రాయగిరి ఉన్నాయి. ప్రాముఖ్యత కలిగిన మరికొన్ని ప్రాంతాలను వైటీడీఏలో కలపడం ద్వారా మరింత ఆదాయ వనరులను పెంచుకోవడానికి చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా వైటీడీఏ పరిధిని మరింత విస్తరించాలని, ఇందుకు ప్రతిపాదనలు సమర్పించాలని సీఎస్ శాంతి కుమారి బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రతిపాదించారు. యాదాద్రి దేవస్థానం నిర్మాణం అద్భుతంగా జరగడంతో రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. దేవస్థాన పరిసర ప్రాంతాలు, గ్రామాలను అభివృద్ధి చేసి స్వయంగా ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు.

వైటీడీఏకు 2,177 ఎకరాల భూములు
యాదాద్రి అభివృద్ధిలో భాగంగా వైటీడీఏ వద్ద 2,177 ఎకరాల భూమి ఉంది. ఇందులో దేవాలయ భూములు 166.07ఎకరాలు, అటవీశాఖ భూములు 467.06ఎకరాలు, ప్రభుత్వ, పట్టా భూములు వివిధ వర్గాల నుంచి కొనుగోలు చేసినవి 803.37ఎకరాలు, నీటిపారుదల శాఖకు చెందిన చెరువులు 174.28 ఎకరాలు, అసైన్డ్ కాని భూములు 565.37ఎకరాలు గుర్తించి వైటీడీఏకు అప్పగించారు. వీటిలో యాదాద్రి దేవాలయ అభివృద్ధి, వసతి పనులు చేపట్టారు.

భక్తులు, పర్యాటకుల ద్వారా..
యాదాద్రికి వచ్చే భక్తులు, పర్యాటకుల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం తాజాగా చర్యలు ప్రారంభించింది. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తుల కోసం ఇప్పటికే యాదాద్రి రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్టకు వెళ్లడానికి బస్, ఆటోలు, రైలు రవాణా సౌకర్యాలు ఉన్నాయి. యాదగిరీశుడిని దర్శించుకున్న అనంతరం ఆలేరు మండలంలోని కొలనుపాకకు చేరుకుంటే అక్కడ పురావస్తు శాఖ మ్యూజియంతో పాటు, వీరశైవ మతానికి చెందిన చండికాంబ సహిత సోమేశ్వరాలయం, జైనుల ఆరాధించే జైన దేవాలయం ఇక్కడ ఉన్నాయి. భువనగిరి ఖిలా ఇప్పటికే పర్యాటకుల మనసు దోచుకుంటుంది. బస్వాపూర్‌లో ప్రభుత్వం ప్రకటించిన విధంగా బృందావన్ తరహా గార్డెన్‌లు, బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులతో కిటకిటలాడనున్నాయి.

ఇప్పటికే సోమేశ్వరాలయం పునరుద్ధరణ పనులు..
యాదాద్రి పరిసర ప్రాంతాల్లోని పర్యాటక, పుణ్యక్షేత్రాలను కలుపుకుని వైటీడీఏ పరిధి విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది. యాదగిరిగుట్టకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న భువనగిరి ఖిలాను, 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న బస్వాపూర్ నృసింహ రిజర్వాయర్, 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొలనుపాకను వైటీడీఏ కిందికి చేర్చాలని గతంలోనే సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. కొలనుపాకలో వైటీడీఏ ఆధ్వర్యంలో ఇప్పటికే శ్రీ సోమేశ్వరాలయం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష
హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో బుధవారం యాదాద్రి ఆలయ అభివృద్ధి అథారిటీ, శిల్పారామాల అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ ఏరియా (వైటీడీఏ) పరిధిని మరింత విస్తరించి స్వీయ ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వైటీడీఏ పరిధిలో ఉన్న 7 గ్రామాల పరిధిని మరింత విస్తరించాలని పేర్కొన్నారు. ఇందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అదేవిధంగా దేవస్థానానికి సంబంధించిన ఆడిట్ నివేదికలు, శిల్పారామాల పనితీరును సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర స్థాయి అధికారులతోపాటు వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, యాదాద్రి దేవస్థానం ఈఓ గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **మిషన్లు చల్లబడేలా..**


ఎండలు మండుతున్నాయి. దీంతో పెట్రోల్‌బంక్‌లోని మిషన్లలో సైతం ఎండవేడిమికి సాంకేతిక సమస్యలు తలెత్తున్నాయి. దీంతో భువనగిరి పట్టణంలో పెట్రోల్ బంకు వద్ద మిషన్లకు చల్లదనం కోసం చుట్టూ ఇలా వాటర్ పైప్ ద్వారా నీరు పెడుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

న్యూస్‌రీల్

వాసాలమర్రిలో అభివృద్ధి పనుల పరిశీలన


పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న తివారీ

తుర్కపల్లి: తుర్కపల్లి మండలంలోని ముఖ్యమంత్రి దత్తత గ్రామం వాసాలమర్రిలో బుధవారం పలు అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఇందులో భాగంగా హెల్త్ సబ్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం పనులు ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించి, అదే స్థలంలో నూతన భవన నిర్మాణాలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రాంశెట్టిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. ఆయన వెంట డీపీఓ సునంద, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ గిరిధర్, టీఎస్‌డబ్ల్యూఈఐడీసీ శివకుమార్, సెక్టోరల్ ఆఫీసర్ అండాలు, ఎంపీపీ సుశీల, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ నవీన్‌కుమార్, ఎంపీడీఓ ఉమాదేవి ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: అనాథ, పాక్షిక అనాథ బాలికలు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2022–2023)లో పదో తరగతి పూర్తి చేసిన అనాథ, పాక్షిక, నిరుపేద, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి, అక్రమ రవాణాకు గురైన, బాధిత బాలికలకు ఎలాంటి అర్హత పరీక్షా లేకుండా నేరుగా శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణా సంస్థ హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ డిప్లొమా (2023–24) కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, ధ్రువపత్రాలు జత చేసి మే 8 వరకు పాత మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న బాలల సంరక్షణ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి బూస్టర్ డోస్

- జిల్లాకు చేరిన 8 వేల కార్బెవాక్స్ టీకాలు
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 26 కేంద్రాలు

భువనగిరి: కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో ఈ పరీక్షలు చేస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో రోజుకు సుమారు 40 నుంచి 75 వరకు కోవిడ్ పరీక్షలు చేస్తున్నారు. దీంతో స్వల్పంగా కోవిడ్ కేసులు నమోదు అవుతుండడంతో అధికారులు ఇప్పటికే ప్రజలకు అప్రమత్తపై సూచనలు చేశారు. తోడు ప్రభుత్వం మొదటి, రెండు డోసులు వేసుకున్న వారికి బూస్టర్ డోసు వేయడానికి జిల్లాకు కార్బెవాక్స్ టీకాలను పంపిణీ చేసింది. కోవిడ్ బారి నుంచి రక్షణ పొందేందుకు అర్హులైన వారు బూస్టర్ డోస్ వేయించుకోవాలని వైద్య అధికారులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు పంపిణీ చేసిన టీకా వివరాలు

మొదటి డోస్ వేసుకున్న వారి సంఖ్య	5,57,643
రెండో డోస్ వేసుకున్న వారి సంఖ్య	5,64,692
బూస్టర్ డోస్ వేసుకున్న వారి సంఖ్య	2,76,107

మొదటి, రెండో డోస్ వేసుకున్న వారు..
జిల్లాకు ప్రస్తుతం 8 వేల కార్బెవ్యాక్స్ టీకాలు వచ్చాయి. ఇప్పటికే కోవాక్సిన్‌గాని కోవిషీల్డ్ గాని మొదటి, రెండో డోసు వేసుకున్న 18 సంవత్సరాలు పైబడిన వారు ఈ బూస్టర్ డోసు వేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 12 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయసు గల వారు మొదటి డోసు తీసుకుని రెండో డోస్ తీసుకోనట్లయితే ఈ వ్యాక్సిన్‌ను రెండో డోసుగా తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కాగా.. బూస్టర్ డోసు పంపిణీ గురువారం నుంచి ప్రారంభించనున్నారు. బూస్టర్ డోసు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రిలో బూస్టర్ డోస్ వేయనున్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన అనంతరం మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవ, రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. వివిధ పూజలతో శ్రీ స్వామి వారికి రూ.11,48,286 నిత్యాదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.


సువర్ణ మూర్తులకు హారతినిస్తున్న అచార్యులు

మరో ఆరు సహకార బ్రాంచీలు

- 18వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 36కు చేరిన బ్రాంచీలు
- నూతన పాలకమండలి వచ్చిన మూడేళ్లకే అనుమతి
- మరింత విస్తృతం కానున్న బ్యాంకు సేవలు



నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఖాతాలో మరో ఆరు నూతన బ్రాంచీలు చేరనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాంకు పరిధిలో ప్రస్తుతం 30 బ్రాంచీల ద్వారా రైతులకు సేవలు అందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జిల్లాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుతో పాటు 12 బ్రాంచీలు కలిపి 13, యాదాద్రిభువనగిరి జిల్లాలో 8, సూర్యాపేట జిల్లా పరిధిలో 9 బ్రాంచీల ఉన్నాయి. నూతన పాలకమండలి బాధ్యతలు స్వీకరించిన తర్వాత 13 కొత్త బ్రాంచీలను విస్తరించి రైతులకు బ్యాంకు సేవలను మరింత చేరువ చేయాలని నిర్ణయించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను అనుమతి కోరింది. సాధ్యసాధ్యాలను పరిశీలించిన రిజర్వ్ బ్యాంకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొత్తగా 6 బ్రాంచీల ఏర్పాటుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు 18వ తేదీన (మంగళవారం) రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రభుతిసమాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీలు ఇక్కడే..
నల్లగొండ జిల్లాలోని చిట్యాల, చండూరు, నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో, యాదాద్రిభువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి, రాజాపేట, సూర్యాపేట జిల్లాలోని మేళ్లచెరువు మండల కేంద్రంలో నూతన బ్రాంచీని ఏర్పాటు కానున్నాయి. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి నేతృత్వంలోని నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన మూడేళ్లలో ఆరు బ్రాంచీల ఏర్పాటుకు అనుమతిరావడంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లాభాల బాటలో బ్యాంకు..
డీసీసీబీ తన పరిధిలోని బ్రాంచీల ద్వారా రైతులతో పాటు వ్యాపారస్తులు, విద్యార్థులకు రుణాలను అందిస్తోంది. జిల్లాలోని 4,26,167 మంది రైతులు, ఖాతాదారులకు సేవలు అందుతున్నాయి. గోల్డ్ లోన్స్, విద్యా రుణాలు, వాహన కొనుగోలు రుణాలు, లాంగ్‌టర్మ్, పాడి, గొర్రెల పెంపకం, పౌల్ట్రీఫారాలు ఏర్పాటుకు భూమిని తనఖా పెట్టుకుని రుణాలను అందిస్తోంది. సేవలను విస్తరించడం, వివిధ రకాల రుణాలు ఇవ్వడంతో పాటు వ్యాపారాలను విస్తరించడంతో బ్యాంకు నేడు లాభాల దిశలో పయనిస్తోంది. రూ.2100 కోట్ల వ్యాపారంతో రూ.36 కోట్ల 50లక్షల లాభాల్లో ఉంది. మరోవైపు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. 14 ఏటీఎంలు, మూడు మొబైల్ ఏటీఎంల ద్వారా సేవలను అందుతున్నాయి. త్వరలో పేటీఎం సేవలను కూడా అందుబాటులోకి తేనుంది.

సమష్టి కృషితో లాభాల బాట



మా పాలకవర్గం బాధ్యతలను స్వీకరించిన తర్వాత సమష్టి కృషితో బ్యాంకును అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తున్నాం. పాలకవర్గ సభ్యులు, బ్యాంకు ఉద్యోగులు అందించిన సహకారంతోనే బ్యాంకు లాభాల దిశలో పయనిస్తుంది. ఆరు కొత్త బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్‌బ్యాంకు అనుమతినిచ్చింది. ఇంకా ఏడు బ్రాంచీలకు అనుమతిరావాల్సి ఉంది. ప్రస్తుత బ్రాంచీలకు అనుమతి రావడానికి సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, టిస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు.
– గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

కాంగ్రెస్‌లో 'నిరుద్యోగ ఉద్యమ' చిచ్చు

- 21న ఎంజీయూలో సభ నిర్వహిస్తామన్న రేవంత్
- జిల్లా నేతలకు తెలియకుండా ప్రకటించడంపై ఎంపీ ఉత్తమ్ సీరియస్
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి లేఖ
- వారి ఆదేశాల మేరకు సభ వాయిదా
- తర్వాత ప్రకటిస్తామన్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మహాత్మాగాంధీ యూనివర్సిటీనుంచి ఈనెల 21వ తేదీన నిరుద్యోగ ఉద్యమం ప్రారంభిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఇప్పటికే సీనియర్లు, జూనియర్ల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న లుకలుకలు రేవంత్‌రెడ్డి తీరుతో మళ్లీ బయటపడ్డాయి. జిల్లా నేతలతో సంప్రదించకుండానే రేవంత్‌రెడ్డి నల్లగొండలో సభను నిర్వహిస్తామని ప్రకటించడాన్ని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేకు లేఖ రాశారు. దీంతో పార్టీ పెద్దలు సభను వాయిదా వేసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఈ మేరకు నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అనివార్య కారణాల వల్ల సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



జిల్లా కాంగ్రెస్‌లో గరం గరం..
టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, యువతను తమవైపు తిప్పుకునేందుకు ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రంగంలోకి దిగారు. ఇదే సమయంలో సంజయ్‌పై పోలీసు కేసు నేపథ్యంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఎండగడుతూ ప్రజలోకి వెళ్లి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని రేవంత్‌రెడ్డి అనుకున్నారు. వెనువెంటనే నిరుద్యోగ ఉద్యమాన్ని ఈనెల 21న నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ప్రారంభించి 24వ తేదీన ఖమ్మం, 26వ తేదీన ఆదిలాబాద్, మే 4 లేదా 5 తేదీన హైదరాబాద్‌లో నిరుద్యోగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ సభకు ప్రియాంకగాంధీని పిలుస్తున్నట్లు ప్రకటించారు. అయితే కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఒక ఆనవాయితీ ఉంది. ఏ జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా ముందుగా ఆ జిల్లా పార్టీ నేతలు, ముఖ్యులతో చర్చించిన ఆ తర్వాతే ప్రకటిస్తారు. నిరుద్యోగ ఉద్యమ ప్రారంభ సభ ప్రకటన మాత్రం అందుకు భిన్నంగా చేశారు. జిల్లా నేతలతో చర్చించకుండానే రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నల్లగొండలో సభ నిర్వహించనున్నట్లు ప్రకటించినట్లు తెలిసింది. స్థానిక ఎంపీ అయిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చించకుండానే ప్రకటన చేయడంతో సీనియర్లు, జూనియర్లకు మధ్య ఉన్న భేదాభిప్రాయాలు మరోసారి బయటపడ్డాయి.

అగ్రనేతలకు ఉత్తమ్ లేఖ..
సభ నిర్వహణపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేకు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాసినట్లు తెలిసింది. ×నాకు సమాచారం ఇవ్వకుండానే రేవంత్‌రెడ్డి నా నియోజకవర్గం నుంచి పీసీసీ సభ్యులు, ఆఫీస్ బేరర్లు, ఏఐసీసీ సభ్యులను ప్రకటించడంపై గతంలో మీకు చెప్పాను. నేను ఈ ప్రాంతం నుంచి వరుసగా ఆరు సార్లు ఎన్నికయ్యాను. నాకు ఎలాంటి సమాచారం లేకుండానే రేవంత్‌రెడ్డి తన కార్యక్రమాన్ని నా పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహిస్తానని ప్రకటించడాన్ని మీడియాలో చూశాను. వాస్తవానికి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం, జిల్లాలో పార్టీ దారుణంగా ఉంది. ఇప్పుడు అతను నా నియోజకవర్గంలో సభ పెట్టడం నిజంగా అవమానకరం. అంతేకాదు కొద్దిరోజుల కిందట రేవంత్‌రెడ్డి నాకు ఎయిర్‌పోర్టులో కలిసినప్పుడు ప్రియాంక గాంధీ సభ ఖరారైంది. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నుంచి విద్యార్థులను సమీకరించాలని చెప్పారు. అంతేగానీ నా నియోజకవర్గానికి వస్తున్నట్లు నాతో ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు నల్లగొండ సభ పెడతామని చేసిన ప్రకటన మీడియాలో చూశాను. ఇది చాలా అవమానకరం. అభ్యంతకరం..₹ అని లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది.

ఉత్తమ్ అభ్యంతరాలతో..
ఎంజీయూలో ఈనెల 21న రేవంత్‌రెడ్డి తలపెట్టిన నిరుద్యోగ ఉద్యమ సభ వాయిదా పడింది. ఉత్తమ్‌కు తెలియకుండా సభను ఖరారు చేయడంపై ఆయన సీరియస్‌గా స్పందించడం, అభ్యంతరం వ్యక్తం చేయడం, ఏఐసీసీ, రాష్ట్ర ఇన్‌చార్జికి లేఖ రాయడంతో సభ వాయిదా పడింది. అయితే అనివార్య కారణాల వల్ల సభ వాయిదా పడినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనేది తరువాత ప్రకటిస్తామని తెలిపారు.

ఉత్తమ్, భట్టి టార్గెట్‌గా..!
ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు సీఎల్పీ నేత, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు భట్టి విక్రమార్కను టార్గెట్ చేసుకొనే సభలు తలపెట్టారనేది చర్చ పార్టీలో జోరుగా సాగుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలంగా ఉన్న ఇద్దరు ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఈ సభకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా తలపెట్టడం ఏమిటని వారి సన్నిహితులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలోనే ఉండగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ రహదారి విస్తరణపై చర్చించేందుకు కేంద్ర మంత్రులతో ముందస్తుగా నిర్ణయమైన షెడ్యూల్ మేరకు ఢిల్లీలో ఉన్నారు. స్థానికంగా ఉన్న ఉత్తమ్ మాత్రం ఈ విషయం సీరియస్‌గా తీసుకున్నారు. స్థానిక ఎంపీనైన తనకు తెలియకుండా సభ ఎలా తలపెట్టారంటూ మండిపడ్దారు.

మూడు రోజుల పాటు భట్టి విక్రమార్క పీపుల్స్‌మార్చ్

సాక్షి, యాదాద్రి: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ జిల్లాలో మూడు రోజుల పాటు సాగనుంది. 29, 30, మే 1వ తేదీల్లో చేపట్టే పాదయాత్రకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 29న జిల్లాకు భట్టి పాదయాత్ర చేరుకుంటుంది. భువనగిరిలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆలేరు నియోజకవర్గంలో టీపీసీసీ మెంబర్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగనుంది. జనగామ జిల్లా పెంబర్తి నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు, కొలనుపాక, రాజాపేట మీదుగా రఘునాథపురంలో రాత్రిబస చేస్తారు. 30న ఉదయం పొట్టిమర్రి నుంచి మాసాయిపేట, సైదాపురం మీదుగా యాదగిరిగుట్టకు చేరుకుంటుంది. సాయంత్రం భువనగిరి నియోజకవర్గం బస్వాపూర్‌లోకి పాదయాత్ర ప్రవేశిస్తుంది. మే 1న కాశేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన నృసింహ రిజర్వాయర్ పనుల పూర్తి, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వంటి ప్రధాన సమస్యలపై భట్టి విక్రమార్క ప్రజలతో సమావేశం కానున్నారు. బస్వాపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించి భువనగిరి మీదుగా ముగ్దుంపల్లి, భట్టుగూడెం, పోచంపల్లి మీదుగా ఇబ్రహీంపట్నంకు యాత్ర చేరుకోనుంది.

జయప్రదం చేయాలి : కుంభం
పీపుల్స్ మార్చ్‌ను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో భువనగిరిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ, టీపీసీసీ పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగళ్లపల్లి రవికుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బయోమైనింగ్ పనులు పూర్తిచేయాలి

భువనగిరి: భువనగిరి మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను వచ్చే నెల 15 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. బుధవారం తుక్కాపురం రోడ్డు మార్గంలో ఉన్న డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఇంటింటా సేకరించిన వ్యర్థాల బయోమైనింగ్ ప్రాసెస్ ప్రక్రియ ఇప్పటికే 50 శాతం పూర్తి చేసినట్లు, మిగిలిన 50 శాతం పనులు నిర్ణీత గడువు నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రాసెస్ పూర్తయిన తర్వాత ఎరువును రైతులకు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ పరిశ్రమలకు తరలించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, బయోమైనింగ్ ఏజెన్సీ సాగర్, మోటార్స్ ప్రతినిధులు ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ : తాటి చెట్టు పైనుంచి కింద పడడంతో ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెల్వర్తిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పరకాల స్వామి సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా కాలు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి భువనగిరి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన తర్వాత హైదరాబాద్‌కు తరలించారు.

వరి పొలం దగ్ధం

చిలుకూరు: షార్ట్ సర్క్యూట్‌తో వరిపొలం దగ్ధమైంది. ఈ ఘటన చిలుకూరు మండలం పోలేనిగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రామినేని వీరబాబు పొలం పైనున్న 11 కేవీ విద్యుత్ వైర్లు షార్ట్‌సర్క్యూట్ అయి నిప్పురవ్వలు వచ్చి వరి పొలంపై పడ్డాయి. దీంతో వరిచేనుకు మంటలు అంటుకుని దగ్ధమైంది. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే రెండు ఎకరాల వరి చేను అగ్నికి ఆహుతైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గండ్ర మల్లయ్య రోజుమాదిరిగా మంగళవారం కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చిన తరువాత అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడినుంచి నల్లగొండ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పరామర్శించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ : నిబంధనలు అతిక్రమించి అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి మండలం ఉమ్మెంతాలపల్లి నుంచి దేవరకొండ మండల పరిధిలోని ఇద్దంపల్లి మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా శరసనగండ్ల వైపునకు ఆటోలో బియ్యం తరలిస్తుండగా మంగళవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ధ్వజ స్తంభం చుట్టూ గ్లాస్ బిగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ప్రధానాలయ ముఖ మండపంలో ఉన్న స్వర్ణ ధ్వజ స్తంభం, బలిపీఠం చుట్టూ ఆలయాధికారులు గ్లాస్‌ను బిగించారు. ప్రధానాలయం ఉద్ఘాటన జరిగిన నాటి నుంచి భక్తులు భారీ సంఖ్యలోశ్రీస్వామిని దర్శించుకున్న అనంతరం ధ్వజస్తంభం వద్దకు వచ్చి తాకుతున్నారు. బంగారు పూతతో ఉన్న ధ్వజ స్తంభం, బలిపీఠం భక్తులు తాకుతున్న నేపథ్యంలో చుట్టు గ్లాస్‌ను బిగించారు.

'బలగం'తో ప్రకృతి వ్యవసాయం

- గానుగ నూనెల తయారీలో ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి కుటుంబం
- రోజుకు 20 నుంచి 30 లీటర్ల నూనె ఉత్పత్తి
- సేంద్రియ ఎరువులతో పలు రకాల పండ్ల తోటలు సాగు
- వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు



అరుణ్‌తేజ వ్యవసాయ క్షేత్రం



స్వచ్ఛమైన గానుగ నూనె

తుర్కపల్లి: రోజు రోజుకూ పెరుగుతున్న ఆహారం కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలువుతున్నారు. స్వచ్ఛమైన నూనెలు మార్కెట్‌లో లభించక పోతుండడంతోనే వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులంటున్నారు. అయితే తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామశివారులో ఓ ఉమ్మడి కుటుంబం ప్రకృతి వ్యవసాయంతో స్వచ్ఛమైన గానుగ నూనెను తయారు చేసి విక్రయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో..

మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లికి చెందిన సోదరులు డేగల సుధాకర్, డేగల రవీందర్ వాసాలమర్రి గ్రామ శివారులో నాలుగు ఎకరాల్లో రసాయన ఎరువులు వాడకుండా వ్యవసాయం చేస్తున్నారు.దేశవాళి ఆవుల పేడతో జీవామృతం, ఘన జీవమృతాలను తయారు చేసుకొని పండ్లతోటలు, కూరగాయలు, వరి, నూనె గింజలు సాగు చేస్తున్నారు. వీరిసాగు తీరును పరిశీలించడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వ్యవసాయ శాస్త్రవేతలు సందర్శిస్తున్నారు.

కూలీలకు ఉపాధి కల్పిస్తూ..

ప్రకృతి వ్యవసాయంతో పాటు ప్రాచీన పద్ధతుల్లో ఎద్దుల గానుగతో వేరుసెనగ, నువ్వులనూనె, కుసమనూనె, కొబ్బరి నూనె, ఆవనూనె, సంప్రదాయ నూనెలను తయారు చేస్తున్నారు. ఈ వ్యవసాయ క్షేత్రంలో వారితో పాటు నలుగురు కూలీలకు ఉపాధికల్పిస్తూ రోజు 20 నుంచి 30 లీటర్ల నూనెను ఉత్పత్తి చేస్తున్నారు.

కల్తీ నూనెలతో పెరుగుతున్న రోగాలు

మార్కెట్లో దొరుకుతున్న కల్తీ నూనెల వల్ల ప్రజలు తీవ్రమైన దీర్ఘకాలిక రోగాలతో పాటు శరీరంలో కొవ్వు శాతం పెరిగి గుండె, పక్షవాతం, గ్యాస్, జీర్ణకోశ, బీపీ, షుగర్, కంటి , చర్మసంబంధిత వ్యాధులు, కొన్ని రకాలైన కాన్సర్ల భారీన పడుతున్నారని వైద్యులంటున్నారు. నూనె స్వచ్ఛమైతే ఈ రోగాల నుంచి బయట పడవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

గానుగ నూనెలకు భలే గిరాకీ

కట్టే గానుగల ద్వారా తయారు చేసిన నూనెలను కొనుగోలు చేయడానికి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైదరబాద్ నుంచి కూడా పెద్ద సంఖ్యలో వచ్చి కొనుగోలు చేస్తున్నారు.రుణ్‌తేజ వ్యవసాయ క్షేత్రానికి వచ్చే కొనుగోలుదారుల ముందే నూనెలను అప్పటి కప్పుడు తయారు చేసి ఇస్తున్నారు. ఈ నూనెల్లో ఎటువంటి కల్తీ లేకుండా ఉండడం, ఆరోగ్యంతో పాటుగా వంటలు కూడ రుచిగా ఉంటుండంతో ఈ గానుగ నూనెలను ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వేరు సెనగ నూనె లీటర్‌కు రూ.450, నువ్వుల నూనె రూ.680, కుసమ నునె రూ.580 , కొబ్బరి నూనె కిలోకు రూ.550 చొప్పున విక్రయిస్తున్నారు.

ప్రాచీన పద్ధతుల్లోనే వ్యవసాయం చేస్తున్నాం



ప్రాచీన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలనే సంకల్పతోనే అరుణ్ తేజ వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మాది ఉమ్మడి కుటుంబం , నలుగురు అన్నదమ్ములం. పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పాటు చేసుకొని వ్యవసాయం రంగంలోకి అడుగు పెట్టాం. మేము పండించిన పంటలను మేము వాడుకుంటూ మార్కెట్ కూడా చేస్తున్నాం, గానుగ నూనెల పైన ప్రజలకు కూడా మంచి అవగాహన పెరిగింది.

– డేగల సుధాకర్, రవీందర్, రైతులు

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



రైతులంతా రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి. తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు ఆర్జించవచ్చు. రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గిపోయి పంట దిగుబడి బాగా తగ్గుతుంది. జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– అనురాధ, డీఏఓ, యాదాద్రి జిల్లా

మే 2నుంచి నృసింహ జయంత్యుత్సవాలు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు శ్రీనృసింహ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఈఓ గీతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2వ తేదీన ఉదయం 9.30గంటల నుంచి స్వస్తివాచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, లక్ష కుంకుమార్చన, తిరు వెంకటపతి అలంకార సేవ, సాయంత్రం 6 గంటల నుంచి మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనం, గరుడ వాహనం పరవాసుదేవ అలంకార సేవ నిర్వహిస్తారు. 3వ తేదీన ఉదయం నిత్య మూలమంత్ర హవనం, లక్ష పుష్పార్చన, కాళియమర్దన అలంకార సేవ, సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం, హనుమద్వాహం, హనుమంత వాహనంపై శ్రీరామ అవతార అలంకార సేవ జరిపిస్తారు. 4వ తేదీన ఉదయం 7గంటల నుంచి నృసింహ మూల మంత్ర హవనం, 9గంటల నుంచి 9.30గంటల వరకు మహాపూర్ణాహుతి, అనంతరం సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 7గంటల నుంచి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి చేపట్టి ఉత్సవాలను ముగిస్తారు. ఇక అనుబంధ ఆలయమైన శ్రీపూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సైతం 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

వివిధ పూజలు రద్దు

స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా యాదాద్రి ప్రధానాలయంతో పాటు శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల్లో 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు శ్రీసుదర్శ నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ తేదీల్లో భక్తులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గుర్రంపోడు : మండలంలోని కట్టవారిగూడెం గ్రామంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరు తగిలి వారంలోనే రెండు గేదెలు మృతిచెందడంతో గ్రామస్తులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. బుధవారం గ్రామానికి చెందిన షేక్ జానిపాషకు చెందిన గేదె మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ వైరు తగిలి షాక్‌తో మృతిచెందింది. లక్ష రూపాయల నష్టం జరిగిందని గేదెను షాక్ నుంచి తప్పించే ప్రయత్నంలో తనకు విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలతో బయటపడ్డానని రైతు జానిపాషా వాపోయాడు. గత వారమే ఇదే చోట గుండె బోయిన పెంటయ్యకు చెందిన గేదెకు షాక్‌కు గురై మృతిచెందింది. ఎర్తింగ్‌ను మార్చిన విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ లోపాన్ని గుర్తించి సరిచేయడంలో నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్తులు చనిపోయిన గేదెను ట్రాక్టర్‌లో తీసుకుని వచ్చి సర్పంచ్ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. తరుచు విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ చాడ చక్రవర్తి ఆరోపించారు. గ్రామంలో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని, అధికారుల దృష్టికి తెచ్చినా పట్టింపులేదన్నారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ శ్రీకాంత్ రెడ్డిని ప్రశ్నించగా మొదటిసారి ప్రమాదం జరిగినప్పుడే ఎర్తింగ్ మార్చామని, మళ్లీ ప్రమాదం జరగడం దురదృష్టకరమని అన్నారు. రైతుకు విద్యుత్‌శాఖ నుంచి త్వరగా పరిహారం అందేలా చూస్తామని అన్నారు.

ఇంటింటికీ రంజాన్ తోఫా పంపిణీ

- సొంత ఖర్చుతో ముస్లింలకు అందజేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఏటా అందిస్తున్న తరహాలోనే ఈ సంవత్సరం కూడా ముస్లింలకు మంత్రి జగదీశ్‌రెడ్డి తోఫా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ప్రారంభించారు. పట్టణంలోని జమ్మిగడ్డ, గోపాలపురం, విజయకాలనీ, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో ముస్లింల ఇంటింటికీ తిరిగి తోఫా కిట్లను స్వయంగా ఆయన అందించారు. మండుటెండను సైతం ఖాతరు చేయకుండా మంత్రి జగదీశ్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేయడాన్ని ముస్లింలు స్వాగతిస్తున్నారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, గండూరి ప్రకాష్, రాజేష్, ముస్లిం మైనారిటీ నాయకులు తాహేర్‌పాషా, జహీర్, బాషా, రియాజ్, సయ్యద్, సల్మామస్తాన్ పాల్గొన్నారు.

టీ స్టాల్‌లో చోరీ

యాదగిరిగుట్ట రూరల్: గుర్తుతెలియని వ్యక్తులు టీ స్టాల్‌లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది..బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామానికి చెందిన బింగి నరేష్ బాహుపేట పరిధిలో హైదరాబాద్–వరంగల్ ప్రధాన జాతీయ రహదారి పక్కన టీ ఓషియన్ పేరుతో టీ పాయింట్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మేరకు రోజువారీలాగానే మంగళవారం రాత్రి వరకు షాపును మూసి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం షాపును తెరిచి చూసేసరికి టీ పాయింట్‌లోని వస్తువులు అన్ని చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అదేవిధంగా టీ పాయింట్ వెనక భాగంలో రేకును కట్ చేసి ఉండడం గమనించాడు. వెంటనే షాపులో ఉన్న డబ్బులను చూసుకోగా అందులో 25000 రూపాయలు కనబడలేదు. దీంతో షాపులో దొంగలు పడ్డారని గ్రహించి, పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు షాపును పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోల చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

లింగంపేట: కొంతకాలంగా ఆటోలను చోరీ చేస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు ఆటోలు రికవరీ చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. చోరీకి పాల్పడిన నలుగురిని బుధవారం రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన సింది సారయ్య, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఎల్లయ్యగూడకు చెందిన మసపాక గణేష్, వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం వాల్‌మిది గ్రామానికి చెందిన బాల్‌గుల శ్యామ్, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట్ మండలం నిద్దాన్‌పల్లికి చెందిన గోగు రాజు స్నేహితులు. వీరు మల్కాజిగిరిలో ఉంటూ ఇతరుల ఆటోను కిరాయికి నడిపేవారు. డబ్బులు సరిపోకపోవడంతో ఆటోలను చోరీ చేసి, నంబర్ ప్లేట్ మార్చి తమ సొంత ఆటోలుగా నడిపేవారు. ఈ క్రమంలో ఈ నెల 9న లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన బాలాగౌడ్ ఆటోను వీరు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారాంగా నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా మరో రెండు ఆటోలను కూడా చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని ఎస్సై తెలిపారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మిర్యాలగూడ టౌన్ : ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన మేరావత్ శైలజ పని నిమిత్తం ఈ నెల 15న మిర్యాలగూడకు వచ్చింది. మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్ నుంచి తన పిల్లలు మేరావత్ దత్తు, సులోచనరక్షితతో కనపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిసార్ట్ నిర్వాహకులకు నోటీసులు జారీ



రిసార్ట్ సిబ్బందికి నోటీసులు అందజేస్తున్న అధికారులు

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ పరిధిలో గల ఓ రిసార్ట్ నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. ఇటీవల ఆ రిసార్ట్‌లోని కిచెన్ సెక్షన్‌లో తనిఖీలు చేపట్టగా ఆహార పదార్థాల తయారీలో కల్తీ వస్తువులు వాడుతున్నట్లు తేలడంతో బుధవారం ఫుడ్ సెఫ్టీ అధికారులు రిసార్ట్‌కు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఫుడ్ సెఫ్టీ అధికారి సుమన్‌కళ్యాణ్ మాట్లాడుతూ ప్రజలు తినే ఆహార పదార్థాల విషయంలో కల్తీ సామగ్రి వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్‌లు, ఇతర దాబాల నిర్వహకులు జాగ్రత్తలు తీసుకుని స్వచ్ఛమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. ఆయన వెంట ఫుడ్ సెఫ్టీ అధికారి స్వాతి తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతపల్లి : అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని హోమం తాలపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో నిఘా పెట్టారు. హోమం తాలపల్లి గ్రామ శివారులో ఇసుకతో వస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్లు మంజూరు చేయాలని నిరసన



కలెక్టరేట్ ఎదుట భోజనం చేస్తున్న నిరసనకారులు

భువనగిరిటౌన్ : ఆలేరు పట్టణంలో అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పలువురు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం అనర్హులకు ఇళ్లు మంజూరు చేసిందని ఆరోపించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా అధికార పార్టీ సానుభూతిపరులకు మంజూరు చేశారని, తక్షణమే విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళనకారులు వెంట తెచ్చుకున్న టిఫిన్ బాక్సుల్లోని భోజనం తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పల్లె శేఖర్, దర్శనం కవిత, శంకర్య, సల్మా, నహిమునాబేగం, ఎలగల పద్మారావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



మంగిరెడ్డి మృతదేహం



గోపిరెడ్డి మృతదేహం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామశివారులో 65వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్‌కు చెందిన కొప్పుల మంగిరెడ్డి (45) వ్యాపారం నిమిత్తం బైక్‌పై నకిరేకల్ నుంచి కట్టంగూర్ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో అయిటిపాముల గ్రామశివారులో గల పత్తి మిల్లు సమీపంలోకి రాగానే విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మంగిరెడ్డి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న పోలీసులు కొనఊపిరితో ఉన్న క్షతగాత్రున్ని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య హైందవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో ఒకరు మృతిచెందారు. ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన గోపిరెడ్డి(31) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటూ ఎంఎస్‌ఎన్ కన్‌స్ట్రక్షన్‌లో స్టోర్ ఇన్‌చార్జ్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం విధుల్లో భాగంగా సంగారెడ్డి వెళ్లి తిరిగి రాత్రి హైదరాబాద్ వస్తుండగా మార్గ మధ్యలో పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఎస్‌బీఐ యూటర్న్ వద్దకు రాగానే వెనుకాల నుంచి గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గోపిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మధుసూదన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిరేకల్ ఆస్పత్రిలో నిలిచిన సర్జరీలు

- ఆస్పత్రి సిబ్బంది నడుమ తలెత్తిన వివాదాలే ప్రమాదానికి కారణం?
- ప్రాథమికంగా గుర్తించిన వైద్యవిధాన పరిషత్ అధికారులు, పోలీసులు
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవన్న డీసీహెచ్‌ఎస్



దగ్ధమైన ఆపరేషన్ థియేటర్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ మాత్యు

నకిరేకల్ : నకిరేకల్ ప్రభుత్వాస్పత్రి ఆపరేషన్ థియేటర్ దగ్ధానికి సిబ్బంది నడుమ తలెత్తిన వివాదాలే కారణమని పోలీసులు, వైద్యాధికారుల ప్రాథమిక విచారణలో గుర్తించారు. ప్రమాదంతో ప్రస్తుతం ఆస్పత్రిలో సర్జరీ సేవలు నిలిచిపోయాయి.అయితే ఈ ప్రమాద ఘటనపై అగ్నిమాపక శాఖకు కూడా సమాచారం ఇవ్వకపోవడం చర్చనీయంశంగా మారింది. ఆపరేషన్ థియేటర్‌ను దగ్ధం చేసిన సంఘటనపై అటు పోలీసు, వైద్య విధాన పరిషత్ అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల 30పడకల నకిరేకల్ వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా మార్చిన విషయం తెలిసిందే. ఉన్న 30 పడకల పాత వైద్యశాల సముదాయంలోనే 100 పడకల వైద్యసేవలు అందిస్తున్నారు. ఈవైద్యశాలలో 13 మంది వివిధ కేటగిరీ డాక్టర్లు, 25 మంది నర్సులు, మరో 30 మంది ఇతర సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా కూడా లేదు. ఆస్పత్రికి సెక్యూరిటీ గార్డు ఉన్నప్పటికీ ఇందులో పనిచేస్తున్న సిబ్బందే ప్రమాదం తలపెట్టడంతో ప్రమాదఘటనను గుర్తించలేకపోయినట్లు అనుమానాలు వక్తమవుతున్నాయి.

రూ.2లక్షల ఆస్తి నష్టం

ఈనెల 17న సోమవారం అర్ధరాత్రి తర్వాత ఆస్పత్రి వెనుక భాగన ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను దుండగులు దగ్ధం చేశారు. థియేటర్ వెనుక వైపు కిటికీ అద్దాలు పగులగొట్టి ఎండు గడ్డి ,కాగితాలను లోపల వేసి నిప్పంటించారు. ఈ ప్రమాదంలో ఏసీ, బాయిల్ ఆపరేటర్ యూనిట్, నాలుగు సెట్ల శస్త్ర చికిత్సల పరికరాలు కాలిపోయాయి. సూమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఈథియేటర్ పక్కనే ప్రసూతి, పురుషులు వార్డులు ఉన్నాయి. ఈ ప్రమాదానికి ముందు రాత్రి 12 గంటల వరకు ప్రసూతి ఆపరేషన్లు కూడాచేశారు.ఈ థియేటర్‌లో రెండు ఆక్సిజన్ సిలిండర్లు కూడా ఉన్నాయి. సమయానికి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటనపై మంగళవారం సాయంత్రమే ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ నాయుడు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ గోపి కృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

సీరియస్‌గా తీసుకున్నాం

నకిరేకల్ ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన ఆపరేషన్ థియేటర్‌ను బుధవారం వైద్యవిధాన పరిషత్ జిల్లా అధికారి (డీసీహెచ్‌ఎస్) మాత్యు సందర్శించారు. ఈఘటను సీరియస్‌గా తీసుకున్నామన్నారు.ఈ ప్రమాదానికి ఆస్పత్రి సిబ్బంది మధ్య తలెత్తిన విభేదాలే కారణమని అనుమానం ఉందని చెప్పారు.ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందితో ఆయన సమావేశమైయ్యారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కారకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఆపరేషన్ థియేటర్‌ను మరో నాలుగు రోజుల్లో పునరుద్ధరించి సర్జరీ సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

– డాక్టర్ మాత్యు, డీసీహెచ్‌ఎస్, నల్లగొండ

తల్లీకుమారుడికి నాలుగేళ్ల జైలు

యాదగిరిగుట్ట: వివాహిత ఆత్మహత్యకు కారణమైన తల్లీ కుమారుడికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన గ్యార శ్రీనివాస్‌తో శ్యామల (25)కు 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆ తరువాత శ్రీనివాస్ అతని తల్లి నర్సమ్మ తరచు వేధిస్తుండే వారు. దీంతో మనస్తాపం చెందిన శ్యామల 17–01–2015లో ఇంట్లోనే ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాలుగు రోజుల తర్వాత మృతి చెందింది. కాగా, శ్యామల అత్త , భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వాంగ్మూలం ఇచ్చింది. అప్పట్లో కేసు నమోదు చేసుకున్న యాదగిరిగుట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఆత్మహత్య విచారణలో భాగంగా భువనగిరి ఏఎస్‌జే కోర్టు నిందితులకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పునిచ్చింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుంగతుర్తి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుంగతుర్తి మండల పరిధిలో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెలుగు అంజయ్య (70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అంజయ్య ఈ నెల 16న మామిడి తోటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అంజయ్య భార్య హన్మకొండలో ఉంటున్న కూతురు యాకలక్ష్మికి ఫోన్‌ద్వారా తెలియజేసింది. దీంతో యాకలక్ష్మి మామిడితోటకు కాపాలదారుడిగా ఉన్న ఉంగయ్యకు ఫోన్ చేయగా కలవలేదు. మంగళవారం సాయంత్రం తోట కాపాలదారుగా ఉన్న ఉంగయ్య తుంగతుర్తిలోని ఇంటికి వచ్చి మామిడితోటలో అంజయ్య చెట్టుకు ఉరివేసికొని చనిపోయి ఉన్నడని అతడి భార్యకు చెప్పాడు. దీంతో ఆమె ఘటన స్థలానికి వెళ్లి చూడగా అంజయ్య మామిడిచెట్టుకు లుంగితో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. అతడి శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డానియల్‌కుమార్ తెలిపారు.